

ఇసుక అక్రమ రవాణా చేస్తే సహించం

మున్సిపల్ చైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి


మున్సిపల్ చైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి


పెన్నా నది నుంచి అక్రమంగా ఇసుకను తరలించడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకునేది లేదని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. వైద్య చికిత్సల అనంతరం హైదరాబాదులో విశ్రాంతి తీసుకుంటున్న ఆయన శనివారం వీడియో ద్వారా ఓ ప్రకటన విడుదల చేశారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని పోలీసులకు సూచించారు. నందలపాడులో ఇష్టానుసారంగా ఇసుక రవాణా పాల్పడుతున్నారని దీనినీ అరికట్టాలన్నారు. పట్టణ మొత్తం 40 మంది వరకు ఇసుక అక్రమంగా తరలింపునకు పాల్పడుతున్నారని వెంటనే వారంతా మానుకోవాలని హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే బంధువైనా, స్నేహితుడైనా, కార్యకర్తలైన సహించేది లేదన్నారు. ఇసుక విషయంలో తనను క్షమించాలని కోరారు. తనను నమ్ముకున్న వారందరికీ వందశాతం మంచి చేస్తానని చెప్పారు. కష్టకాలంలో కౌన్సిలర్లు అందరూ అండగా నిలిచారని వారందరికీ తాను ఎంతో చేయాల్సి ఉందన్నారు.

నామినేటెడ్‌పై ఆశలు..!

త్యాగం చేసిన వారికి ప్రాధాన్యత దక్కేనా ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల సమయంలో అధికార తెలుగుదేశం పార్టీలో కొంత మంది నాయకులు తమ స్థానాలను వదులుకున్నారు. ఇతరులకు టిక్కెట్లు ఇచ్చిన పార్టీకి సహకారం అందించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలున్నాయి. ఇందులో సగానికిపైగా స్థానాల్లో అధికార తెలుగుదేశం పార్టీ మార్పులు చేపట్టింది. దీంతో అంతకుముందున్న సీనియర్లు పోటీ నుంచి తప్పుకుని పార్టీకి మద్దతుపలికారు. ఇప్పుడు పార్టీ అన్ని నియోజకవర్గాల్లోనూ విజయం సాధించింది. రాష్ట్రంలోనే అత్యధిక స్థానాల్లో టిడిపియే గెలుపొందింది. అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పోటీ నుంచి తప్పుకుని పార్టీ విజయానికి కృషి చేసిన నేతలకు ఏ మేరకు ఇప్పుడు ప్రాధాన్యత లభిస్తుందన్నది చూడాల్సి ఉంది. ఈ విధంగా తప్పుకుని పనిచేసిన వారిలో అనంతపురం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ఉన్నారు. ఎంతో సీనియర్ నాయకులైన ప్రభాకర్ చౌదరికి గత సార్వత్రిక ఎన్నికల్లో టిక్కెట్టు ఇవ్వలేదు. దగ్గుబాటి వెంకట ప్రసాద్‌కు టిక్కెట్టు ఇచ్చారు. ఆయన గెలుపొందారు. ఈ నేపథ్యంలో ప్రభాకర్‌చౌదరికి ఎటువంటి ప్రాధాన్యతను టిడిపి అధిష్టానం ఇవ్వనుందన్నది చర్చ నడుస్తోంది. అదే రకంగా ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న పరిటాల శ్రీరామ్‌కు కూడా ఆయన కాకుండా బిజెపికి ఆ టిక్కెట్టు కేటాయించారు. అక్కడా బిజెపి విజయం సాధించింది. ఇప్పుడు ఆయనకు ఏ పదవినిస్తారన్నది చర్చ నడుస్తోంది. గతంలో అనంతపురం పార్లమెంటుకు గతంలో పోటీ చేసిన జెసి పవన్‌కుమార్‌రెడ్డి ఈసారి టిక్కెట్టు లేదు. ఆయనకు నామినేటెడ్ పదవి ఏదీ దక్కనుందన్నది చూడాల్సి ఉంది. ఒలంపిక్ అసోసియేషన్‌లో ఆయనకు పదవి దక్కనుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఇక వీరితోపాటు గుంతకల్లులో మాజీ ఎమ్మెల్యే జితేందర్‌గౌడ్, కళ్యాణదుర్గంలో ఉన్నం హనుమంతరాయచౌదరి కుటుంబం, పుట్టపర్తిలో పల్లె రఘునాథరెడ్డి, మడకశిరలో ఈరన్నలకు గత ఎన్నికల్లో అవకాశం దక్కలేదు. ఈరన్న కుమారుడుకి టిక్కెట్టు కేటాయించి ఆఖరి నిమిషంలో మార్పుచేశారు. ఇలా సగానికిపైగా మాజీలకు చోటు దక్కనివారిలోనున్నారు. ఇప్పుడు వీరిలో ఎవరెవరికీ ఎటువంటి స్థానాలు దక్కనునాయన్నది ఆ పార్టీలో చర్చ నడుస్తోంది. ఇక వీరితోపాటు అనేక మంది సీనియరు నామినేటెడ్ పదవులైనా ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవలనే నామినేటెడ్ పదవులపైనా ఒక ప్రకటన చేసియున్నారు. పార్టీ కోసం పనిచేసిన వారి పేర్లు తమ వద్దనున్నాయని, వారికి తగిన విధంగా న్యాయంచేస్తామని ప్రకటించియున్నారు. ఈ నేపథ్యంలో పనిచేసిన వారు ఇప్పటి వరకు పదవులు దక్కని వారు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకుని ఉన్నారు. ఏదో విధంగా అధినాయకుడిని ప్రసన్నం చేసుకుని పదవులు దక్కించుకునే పనిలోనున్నారు. ఇక ద్వితీయ శ్రేణి నాయకులు ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమ పేర్లను సిఫారసు చేయాలని విజ్ఞప్తులు చేసుకుంటూ ఉండటం గమనార్హం. ఇలా అధికారపార్టీ తెలుగుదేశంలో నేతల ఆశలు పెట్టుకుని ఉన్నారు.



'ఎర్రకోట' వేడుకలకు అనంత మెడికోలు


మెడికో విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.మాణిక్యరావు

ప్రజాశక్తి-అనంతపురం

భారత దేశ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఢిల్లీ ఎర్రకోటలో ఆగస్టు 15న నిర్వహించే స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంబిబిఎస్ చదువుతున్న విద్యార్థులు ఎంపిక అయ్యారు. మెడికోలు ఎజి.పరిణీత సాయి, కె.హర్ష శ్రీ విష్ణులు ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఎస్.మాణిక్య రావు అభినందించారు. ఎన్ఎస్ఎస్ సమాజ సేవా కార్యక్రమాలు, మేరి మట్టి మేరా దేశ్, అమత వాటిక, రక్తదానం, మొక్కలు నాటే కార్యక్రమం, అవయవ దానం, కూచిపూడి, భరతనాట్యం, శాస్త్రీయ సంగీతం తదితర అంశాల్లో ప్రావీణ్యాన్ని గుర్తించి డాక్టర్ ఎన్‌టిఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం తరఫున ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ డాక్టర్ నరసింహం,రిజిస్ట్రార్ డాక్టర్ రాధికా రెడ్డి, ఎన్ఎస్ఎస్ సమన్వయ కర్త డాక్టర్ వివేకానందలు ఈ విద్యార్థులతను ఎంపిక చేశారన్నారు. ఆంధ్ర ప్రదేశ్ నుంచి 20 మంది యువకులకు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించగా అందులో అనంత వైద్య విద్యార్థులు ఇద్దరు ఎంపిక కావడం అభినందనీయం అన్నారు. ఇలాంటి అవకాశాలు వచ్చేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్న కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశి నాయుడును అభినందించారు. ఈ నెల 11వ తేదీన విద్యార్థులు ఢిల్లీకి వెళ్లి రాష్ట్రపతి భవన్ దగ్గర ఇంటర్నేషనల్ యూత్ హాస్టల్‌లో 13,14,15 మూడు రోజులు కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు.

ప్రభుత్వ విద్యను కాపాడుకుందాం

యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య-ఘనంగా యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పాలకులు అనుసరిస్తున్న విధానాల వల్ల బలహీనపడుతున్న ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందామని యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఏర్పాటై 50ఏళ్లుపూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవిర్భావం నుంచి నేటి వరకూ క్రమశిక్షణకు మారుపేరుగా, అవినీతిపై రాజీలేని వైఖరితో సమస్యల సాధనకై పోరాట చేస్తోందన్నారు. హక్కుల సాధనలో అలుపెరుగని పోరాటాలు, సమస్యల పరిష్కారంలో అవిశ్రాంత ఉద్యమాలు చేస్తూ ఎన్నో అసాధారణ విజయాలు సాధించామన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయ సంక్షేమమే పరమావధిగా ముందుకెళ్తున్నామన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే వైఖరిని కొనసాగిస్తుందన్నారు. ముఖ్యంగా రీ గ్రూపింగ్ స్కేల్స్ ద్వారా ఉపాధ్యాయుల వేతనాల్లో పెరుగుదలకు యుటిఎఫ్ కృషి చేసిందన్నారు. అప్రెంటీస్ విధానం రద్దులో, ఆటోమేటిక్ అడ్వాన్స్మెంట్ స్కీమ్ వర్తింపచేయుటలో, పారదర్శకమైన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలను రూపొందించడంలో యుటిఎఫ్ ముందుండి పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుతం నూతన పెన్షన్ విధానంతో వృద్ధాప్యంలో భరోసా లేని ఉద్యోగ, ఉపాధ్యాయ జీవితాలకు ఆసరా కల్పించేందుకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరింపజేసేందుకు, గత ప్రభుత్వ విధానాలతో అతలాకుతలమైన ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి రాజీలేని సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.


జెండాను ఎగురవేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఇకపోతే రాష్ట్రం సమైక్యాంధ్రగా ఉండి తెలుగుజాతి ఐక్యంగా ఉండాలని ప్రాంతాలవారీగా అందరినీ ఐక్యంగా కలుపుతూ, విచ్ఛిన్నకర విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు సాగించిందన్నారు. అప్పారి వెంకటస్వామి, రామిరెడ్డి, మైనేని వెంకటరత్నం సారథ్యంలో నీతి, నిజాయితీ, నిబద్ధతతో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడం కోసం పెద్దఎత్తున యుటిఎఫ్ ప్రయత్నం చేసిందన్నారు. పాలకులు అనుసరిస్తున్న ప్రభుత్వ విధానాల వల్ల ప్రభుత్వ విద్యారంగం బలహీన పడుతోందన్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో చేరు విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యను బతికించుకునేందుకు ఉపాధ్యాయులందరూ ఐక్యంగా పని చేయాల్సిన అవసరం ఎంతైనా అవసరమని పిలుపునిచ్చారు. రాబోయే కాలంలో పాలకులెవరైనా ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. యుటిఎఫ్ 50ఏళ్ల కాలంలో యుటిఎఫ్ జెండా మోసి ఉద్యమకాలం దిగ్విజయంగా జరిపి అమరులైన ఉద్యమ నాయకులందరికీ ఉద్యమ జేజేలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ, సీనియర్ నాయకులు మహమ్మద్ జిలాన్, నాగేంద్ర, వివిధ మండలాల నాయకులు నాగేంద్ర, పవన్‌కుమార్, ఆదిశేషయ్య, కొండప్ప, మహమ్మద్‌గౌస్, బికె.నారాయణ, వెంకటనాయుడు, గంగాధర్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యుటిఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రాయదుర్గంలోని ప్రాంతీయ కార్యాలయం వద్ద సమాఖ్య నాయకులు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం, గుమ్మగట్ట మండలాలు, పట్టణానికి చెందిన సమాఖ్య ప్రతినిధులు సిఐటియు, చేనేత సమాఖ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

రూ.25 లక్షలు 'మేఘా'ర్పణం..!

- ◆ గత కమిషనర్ మేఘ స్వరూప్ క్వార్టర్స్‌కు ఆర్భాటాలతో మరమ్మతులు
- ◆ కమిషనర్ వెళ్లిన తర్వాత క్వార్టర్స్ సామగ్రి మాయం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ఇటీవల బదిలీపై వెళ్లిన అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మేఘ స్వరూప్ క్వార్టర్స్‌కు హంగు, ఆర్భాటాలు కల్పించడానికి రూ.25 లక్షల ప్రజాధనం వెచ్చించారు. ఈ పనులకు సంబంధించి వస్తువులను కొనేగోలు చేసే నిమిత్తం రూ.25 లక్షలను ఐదుగురు కాంట్రాక్టర్లకు వెనువెంటనే చెక్కులు రాసి ఇచ్చారు. అయితే ఆఫీసు నిర్వహణాధికారి డిఈఈ కమిషనర్ క్వార్టర్స్ తీర్చిదిద్దే పనులకు అంగీకరించలేదు. దీంతో మరో డిఈ అసిస్టెంట్ ఇంజినీర్‌కు పనులు చేపట్టాలని పురమాయించి, ఐదుగురు కాంట్రాక్టర్లకు పనులు అప్పగించి వాటిని చేయించారు. సాధారణంగా కమిషనర్ క్వార్టర్స్‌లో ఏవైనా మరమ్మతు పనులు లాంటివి చేయాలంటే అందుకు సంబంధించి వ్యయం రెండు, మూడు లక్షల రూపాయలకు మించరాదు. గతంలో ఎన్నడూ లేని విధంగా కేవలం 7 నెలల కాలం కమిషనర్‌గా పనిచేసిన మేఘ స్వరూప్ ఉన్న సమయంలో మాత్రం ఏకంగా క్వార్టర్స్‌కు రూ.25 లక్షల ప్రజాధనంను ధారాళంగా ఖర్చు చేయడం గమనార్హం. ఈ పనులు చేసిన కాంట్రాక్టర్లకు నాలుగు నెలలకుపైగా బిల్లులు ఇంకా చెల్లించని పరిస్థితి ఉంది. వీటితో పాటు పీఏబీఆర్ డ్యాం మోటార్ల మరమ్మతు పనుల బిల్లులు కూడా మంజూరు కాలేదు. చిన్నపాటి కంటిన్జెంట్ బిల్లులను కూడా గత కమిషనర్ లాగిన్‌లోనే ఉంచుకోవడం అప్పుడు పరిపాటిగా మారింది. తన క్వార్టర్స్ హంగులకు మాత్రం ఏకంగా రూ.25 లక్షల బిల్లులకు సంబంధించి చెక్కులు మాత్రం రాసి ఇచ్చేశారు. గతంలో 15 రోజుల పాటు తాగునీటి సరఫరా మోటార్లు చెడిపోయి నగరంలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మోటార్లను మరమ్మతులు చేసి తర్వాత నీటిని అందించారు. ఈ పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఇప్పటికే బిల్లులు చెల్లింపు కాలేదు. రూ.రెండు కోట్ల కంపోస్టు యార్డు బిల్లుల ఫైలుపై బదిలీకి నాలుగు రోజుల మునుపు కమిషనర్ మేఘ స్వరూప్ సంతకం చేసి పంపారు.


గత కమిషనర్ గదికి ఏర్పాటు చేసిన ఏసీ

సాధారణ కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో కంపోస్ట్ యార్డులో జరిగిన అవినీతిపై సాక్షాత్తు పాలకవర్గం సభ్యులు గంటలు తరబడి వాదోపవాదాలు చేసినా వాటికి సరైన సమాధానం అప్పటి కమిషనర్ ఇవ్వలేకపోయారు. ఇంజినీరింగ్ విభాగం అధిపతి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డితో మాత్రమే కంపోస్ట్ యార్డ్ చరిత్రను చదివి వినిపించే ప్రయత్నం చేశారు. ఇందులో అవినీతి అంశం మాత్రం ఎక్కడా పేర్కొనకుండా అధికారులు జాగ్రత్త పడ్డారు. కంపోస్టుయార్డు పనులకు సంబంధించి పది రోజుల క్రితం నోవా గ్రీన్ ఎనర్జీ ఇంజినీరింగ్ లిమిటెడ్ ప్రతినిధులు అకౌంటింగ్ సెక్షన్ ఆఫీసర్ పద్మావతి వద్దకు వచ్చి బిల్లులపై మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ఫైల్ కదలికలో సైతం ఏదో మతలబు జరిగి ఉండవచ్చనే భావన ఉద్యోగ వర్గాల్లో వ్యక్తం అవుతోంది.

క్వార్టర్స్ వస్తువులు మాయం

కమిషనర్ మేఘ స్వరూప్ క్వార్టర్స్ ఖాళీ చేసి వెళ్లిన తర్వాత నాలుగు ఏసీలు, టేబుళ్ల మాత్రమే మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకున్నాయి. ఆఫీసు నిర్వహణ అధికారి డిఈఈ ఛాంబర్‌కు ఒక ఏసీ బిగించారు. అదనపు కమిషనర్ గదికి ఒక ఏసీ బిగించారు. కర్టెన్ పరుపులు, సోఫాలు ఫ్రిడ్జ్‌లు తదితర ఖరీదైన సామగ్రి మున్సిపల్ ఇప్పటికీ కార్పొరేషన్ కార్యాలయానికి చేరలేదు. ప్రజాదనంతో కొనుగోలు చేసిన ఈ వస్తువులు ఎక్కడికి వెళ్లాయనే ప్రశ్న ఉద్యోగ వర్గాల్లో మొదలైంది. కాగా సోఫా పాడైపోవడంతో మరమ్మతు చేయిస్తున్నామంటూ కొందరు ఉద్యోగులు చెప్పుకొస్తున్నారు. ఇలా చెప్పుకుంటూపోతే కార్పొరేషన్‌లో అవినీతి అక్రమాలు యథేచ్ఛగా జరుగుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. గత కమిషనర్ క్వార్టర్స్ మరమ్మతుకు నిధులు, నూతన వస్తువులు కొనుగోలు, ఆ వస్తువులు ప్రస్తుతం కన్పించకుండా పోవడంపై సంబంధిత ఉన్నతాధికారులు విచారణ జరిపితే మరిన్ని వాస్తవులు వెలుగు చూసే అవకాశం ఉంటుందనే భావన కార్పొరేషన్‌లో చర్చ జరుగుతోంది.

వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో వేయాలి : డిఎంహెచ్ఒ


ప్రయివేట్ ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ ఇబి.దేవి

ప్రజాశక్తి- అనంతపురం అర్బన్

ఆసుపత్రిలోని వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో వేయాలని డిఎంహెచ్ఒ ఇబి.దేవి సూచించారు. శనివారం నగరంలోని యశోదా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిలో వచ్చే వ్యర్థ పదార్థాలను సక్రమమైన పద్ధతిలో డిస్పోజ్ చేయడం లేదని ఫిర్యాదులు అందడంతో తనిఖీ చేసినట్లు తెలిపారు. అన్ని ప్రయివేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు వ్యర్థ పదార్థాలను బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వారితో అనుసంధానమై శాస్త్రీయ పద్ధతిలో డిస్పోజ్ చేయాలని ఆదేశించారు. బయో మెడికల్ వేస్ట్ ప్రమాదకరమైందన్నారు. నిర్లక్ష్యంగా పారవేసే ముందు ఒక్కసారి ఆలోచించాలన్నారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

మెరుగైన సేవలందించడమే లక్ష్యం

ఎస్పీ కెవి.మురళీకృష్ణ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

జిల్లా పోలీస్ కంట్రోల్ రూంలో నిర్వహిస్తున్న అన్ని విభాగాలను మరింత బలోపేతం చేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని ఎస్పీ కెవి.మురళీకృష్ణ తెలిపారు. జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహిస్తున్న పోలీస్ కంట్రోల్ రూం, డయల్ 100, సైబర్ క్రైం, తదితర విభాగాలను ఎస్పీ శనివారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయా విభాగాల పని తీరు, నిర్వహణపై సమీక్ష చేశారు. ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణల కోసం ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను కమాండ్ కంట్రోల్ ద్వారా వీక్షించి పలు సూచనలు చేశారు. ఆయా విభాగాల్లో పని చేస్తున్న ప్రతీ సిబ్బందితో ముఖాముఖి మాట్లాడారు. అనంతపురం నగరంతోపాటు అన్ని మున్సిపల్, పట్టణాల్లోని శివారు ప్రాంతాలు సైతం కవర్ అయ్యేలా సిసికేమేరాలను సిద్ధం చేసి నిఘా ఉంచాలన్నారు. ప్రజలు ఇళ్లకు తాళం వేసి ఊళ్లకు వెళ్లే సమయంలో లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం జిల్లాలో ఏవిధంగా నడుస్తుందో, ఎన్ని కెమెరాలు పని చేస్తున్నాయో అడిగి తెలుసుకోవడంతో పాటు మరింత మెరుగ్గా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, ఎస్‌బి సిఐ ఇందిర, పోలీస్ కంట్రోల్ రూం సిఐ దేవానంద్, సైబర్ సెల్ సిఐ షేక్ జాకీర్ పాల్గొన్నారు.


సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ కె.వి.మురళీకృష్ణ


వివేకానంద పాఠశాల యాజమాన్యంతో వాదిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నిబంధనలు పాటించని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు హిరణ్య

ప్రజాశక్తి-వజ్రకరూరు

ప్రభుత్వ నిబంధనలో పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉరవకొండలోని వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు హిరణ్య డిమాండ్ చేశారు. శనివారం రెండవ శనివారం సెలవు కావడంతో నిబంధనలను ఉల్లంఘించి తరగతులు నిర్వహిస్తున్న వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాల వద్దకు ఎస్ఎఫ్ఐ నాయకులు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించడం సరైన పద్ధతి కాదన్నారు. విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులను కూడా పీల్చి పిప్పి చేసే విధంగా చేసే విధంగా వ్యవహరిస్తున్న వివేకానంద పాఠశాల యాజమాన్యంపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వివేకానంద పాఠశాలపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉరవకొండ మండల నాయకులు సురేష్, వినయ్, సతీష్, నందు తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడికక్కడ నిలిచిపోతున్న మురుగు

నీరు నిల్వతో వెదజల్లుతున్న దుర్గంధం
రోగాల బారిన ప్రజలు
ఆందోళనలో డాక్టర్ గఫూర్ కాలనీవాసులు


నిలిచిపోయిన మురుగునీటిని పరిశీలిస్తున్న స్థానికులు

ప్రజాశక్తి-అనంతపురం

ఎన్టీఆర్ మార్గ్‌కు ఆనుకుని ఉన్న గఫూర్ కాలనీవాసులు మురుగునీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ చివరలో ఎన్టీఆర్ మార్గ్ ఏర్పాటు కావడంతో ప్రస్తుతం ఆప్రాంతం వరకూ నివాసాలు, చిన్నపిల్ల స్కూల్ వంటివి ఏర్పాటు చేశారు. గతంలో పై ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు, వర్షం నీరు ఎన్టీఆర్ మార్గ్‌లో సమీపంలో ఉన్న పెద్దకాలువలోకి వెళ్తేది. అయితే 10 రోజుల క్రితం రోడ్డుకు ఆనుకుని ఉన్న స్థలాల యజమానులు మురుగునీరు వెళ్లకుండా అడ్డుగా మట్టి వేసుకున్నారు. దీంతో మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. నీరు నిల్వ ఉండటంతో దుర్గదం వెదజల్లుతూ దోమలకు ఆవాసంగా మారుతోంది. ఫలితంగా సమీపంలో ఉన్న ప్రజలతోపాటు పాఠశాలకు వచ్చే విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారు. ఈ విషయంపై అనేకమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు, వర్షం నీరు ఎక్కడికక్కడ వెళ్లేలా చూసి, రోగాల బారి నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

వేరుశనగ రైతులు మెలకువలు పాటించాలి

వ్యవసాయ శాఖ అధికారిణి సరిత


వేరుశనగ పంటలో మెళకువలను వివరిస్తున్న వ్యవసాయ అధికారి సరిత

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

వేరుశనగ పంట సాగు చేసిన రైతులు అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని వ్యవసాయ శాఖ అధికారిణి సరిత సూచించారు. శనివారం మండల పరిధిలోని వీపులుపర్తి, బ్రహ్మసముద్రం, ముప్పులకుంట, పిల్లలపల్లి గ్రామాల్లో పర్యటించి రైతులు సాగు చేసిన పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వేరుశెనగ సాగు చేస్తున్న రైతులు ఈక్రాప్ నమోదుతోపాటు పంట దిగుబడుకు అవసరమైన మెళకువలు పాటించాలన్నారు. ఇలా చేయడం ద్వారా అధిక దిగుబడి సాధ్య మన్నారు. మండలంలో 12 వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు అయ్యా యన్నారు. అయితే 14 సచివాలయాల పరిధిలో కేవలం 200 ఎకరాలకు మాత్ర మే ఈక్రాప్ నమోదు చేశారన్నారు. మిగిలిన రైతులు కూడా ఈక్రాప్ బుకింగ్ చేసుకోవాలని కోరారు. ఇకపోతే వేరుశనగ పంటకు 40-45 రోజులప్పుడు ఎకరాకు 200 కిలోల జిప్సం వేసుకొని భూమిలో కలియబెట్టాలన్నారు. తద్వారా కాయ పరిమాణం, నూనె శాతం పెరుగుతుందన్నారు. వేరుశనగలో ఇనుము ధాతు లోప నివారణకు ఎకరాకు ఫెర్రస్ సల్ఫేట్ ఒక కిలోకు 200 గ్రాముల సిట్రిక్ ఆమ్లం కలిపి పిచికారి చేయాలన్నారు.

ఉర్దూ జూనియర్ కళాశాలను ప్రారంభించాలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్


కళాశాల భవనాలను పరిశీలిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన మైనార్టీ సంక్షేమ హాస్టల్ భవనంతోపాటు ఉర్దూ పాఠశాల, కళాశాలను ప్రారంభించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, పట్టణ కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో నిర్మించిన మైనారిటీ సంక్షేమ వసతి గృహంతోపాటు ఉర్దూ పాఠశాల, కళాశాల భావనాలను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో 2014లో మైనారిటీ ఉర్దూ అజ్మన్ పాఠశాల అగ్ని ప్రమాదానికి గురికావడంతో అప్పట్లో టిడిపి ప్రభుత్వం సుమారు రూ.2కోట్లు ఎంఎస్‌డిపి నిధులతో 2.50ఎకరాల్లో పాఠశాల, మైనారిటీ సంక్షేమ హాస్టల్ భవనాలను నిర్మించారన్నారు. అంతేగాకుండా అప్పటి ఎమ్మెల్యే జితేంద్రగౌడ్, మంత్రి పరిటాల సునీత భవనాలను ప్రారంభించిందన్నారు. అయితే ఇంత వరకూ నూతన భవనాల్లో విద్యార్థులు ఉండేందుకు అవకాశం కల్పించలేదన్నారు. నాటి నుంచి నేటి వరకూ ఆ భవనలను ప్రభుత్వం ఉపయోగంలోకి తీసుకురాకపోవడంతో భవనాల్లో విలువైన వస్తువులు దొంగల దొంగలించడం, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయన్నారు. అలాగే ఆకతాయిలు కూడా పెరిగిపోయారన్నారు. ప్రభుత్వం అయినా మైనారిటీ విద్యార్థుల చదువును దృష్టిలో ఉంచుకుని భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శివ, చందు, మణికంఠ, కేశవ్, కార్తీక్, ప్రసాద్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు 9 గంటల విద్యుత్ అందించాలి

ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి


విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

నియోజకవర్గంలోని రైతు లందరికీ 9 గంటలపాటు నాణ్యతతో కూడిన ఉచిత విద్యుత్‌ను అందించాలని ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గంలోని ట్రాన్స్‌కో అధికారులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు 9గంటలు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయాలని ఆదేశించారు. పట్టణంతోపాటు మండల కేంద్రాల్లో కోతలు లేకుండా విద్యుత్ సరఫరా అయ్యేలా చూడాలని కోరారు. విద్యుత్ కోతల వల్ల చేనేతలకు ఇబ్బందులు ఏర్పడ కూడదని సూచించారు. సమస్యలు ఏవైనా ఉంటే తమదృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో గుత్తి డిఇ రాజశేఖర్, తాడిపత్రి ఎడి రఘు, తాడిపత్రి రూరల్ ఎడి వసంతకుమార్, తాడిపత్రి పట్టణ ఎఇలు ఉదయ్‌భాస్కర్, వీరాంజనేయరెడ్డి, గ్రామీణ ఎఇ సుదర్శన్‌రెడ్డి, యాడికి ఎఇ రాజారావు, పెద్దవడుగూరు ఎఇ మధుసూదన్, అధికారి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


పల్లకిలో స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు

వైభవంగా శ్రీవారి పల్లకి ఉత్సవం

వజ్రకరూరు : ఉరవకొండ మండల పరిధిలోని పెన్నోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీవారి పల్లకి ఉత్సవం శనివారం సాయంత్రం వైభవంగా సాగింది. ఇందులో భాగంగా శ్రీదేవి,భూదేవి సమేత నరసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభయమానంగా తీర్చిదిద్దిన పల్లకిలో కొలువుదీర్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ విజయ్‌కుమార్, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని మల్లాపురం విష్ణమలై లక్ష్మీ నరసింహస్వామి పల్లకి ఉత్సవం శనివారం ఘనంగా సాగింది. ప్రతి ఏడాది. శ్రావణమాసంలో శనివారం స్వామికి పల్లకి ఉత్సవ నిర్వహించడం ఆనవాయితీ. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు రామ్మూర్తి స్వామీజీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు సుబ్రమణ్యం, లక్ష్మీ సమేత స్వామివారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, ఆకుపూజ, నైవేద్య పూజలు చేశారు. అనంతరం పూలతో అలంకరించిన పల్లకిలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని అధిష్టించి మేళతాళాలతో ఊరేగించారు. మహా మంగళహారతి తీర్థ ప్రసాద వినియోగం గావించారు. సూర్యప్రకాష్, రాధమ్మ దంపతుల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు తిప్పేస్వామి, ఉపాధ్యక్షులు ధర్మన్న, కోశాధికారులు నరసింహులు, సత్యనారాయణ, కార్యదర్శి గురు రాఘవేంద్రప్రసాద్, సభ్యులు కమలాక్షుడు, గురునాథరెడ్డి, రామ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన స్కూల్ కమిటీ ఛైర్మన్లు


ఎమ్మెల్యే శ్రావణిశ్రీతో పాఠశాలల కమిటీ ఛైర్మన్లు

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలో నూతనంగా ఎన్నికైన స్కూల్ కమిటీ అధ్యక్షులు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని అనంతపురంలోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్మన్ నారాయణస్వామి మాట్లాడుతూ పాఠశాలలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, పరిష్కరించాలని, రోడ్డు కూడా వేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ పాఠశాలకు తాగునీటి సమస్య లేకుండా చూస్తానని త్వరలోనే రోడ్డు కూడా వేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా ఉన్నత పాఠశాల కమిటీ ఛైర్మన్ గోపాల్‌రెడ్డి, బాలాపురం స్కూల్ కమిటీ ఛైర్మన్ నారాయణస్వామితోపాటు టిడిపి నాయకులు రామచంద్రారెడ్డి, శ్రీనివాసులునాయుడు, రామసుబ్బారెడ్డి, హనుమంతురెడ్డి, శ్రీరామిరెడ్డి, సంజీవరెడ్డి, తదితరులు ఉన్నారు.


స్వామి దర్శనానికి క్యూలో వెళ్తున్న భక్తులు

భక్తులతో కిక్కిరిసిన కసాపురం

గుంతకల్లు రూరల్ : శ్రావణమాసం మొదటి శనివారాన్ని పురస్కరించుకుని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం భక్తులతో కిక్కిరిసిపోయింది. తెల్లవారుజాము నుంచే స్వామివారి మూలవిరాట్‌కు అభిషేక, అర్చనలు చేశారు. తర్వాత బెంగళూరు నుంచి తెప్పించిన ప్రత్యేక పుష్పాలతో స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ ఈవో భద్రాజీ భక్తులు వచ్చే క్యూలైన్లను, భక్తులు కల్పించే సౌకర్యాలను, భోజనశాలను స్వయంగా పర్యవేక్షించారు. సాయంకాలం సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి సహిత ఉత్సవమూర్తులను యాగ మండపంలో కొలువుదీర్చి అర్చన, అభిషేకలు చేశారు. అనంతరం వెండి రథంలో కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహించారు.

'గంప మల్లయ్య'కు ప్రత్యేక పూజలు


గంప మల్లయ్య స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ప్రజాశక్తి-శింగనమల

శ్రావణమాసాన్ని పురస్కరించుకుని మండలంలోని గుమ్మేపల్లి సమీపంలో కొండపై వెలసిన గంప మల్లయ్య స్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి సంవత్సరం ఆలయ సంప్రదాయ పూజారి ఎత్తైన కొండ పైనుంచి గుహలోకి దిగి స్వామివారికి పూజలు చేసేవారు. అయితే ఈ మధ్యకాలంలో కొండపై నుంచి జారి పడి పూజారి మృతిచెందిన విషయం తెలిసిందే. అప్పటిన ఉంచి ఇక్కడ పూజలను నిలిపివేశారు. కాగా ఈఏడాది ఓ భక్తుడు స్వామి పూనకం రావడంతో కొండపైకి వెళ్లి గుహలోకి వెళ్లి స్వామివారికి పూజలు చేశారు. ప్రస్తుతం ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించాలి

వజ్రకరూరు : రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ సమాజాన్ని విచ్ఛిన్నం చేసే వక్ఫ్ సవరణ బిల్లును టిడిపి, జనసేన పార్టీలు వ్యతిరేకించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ డిమాండ్ చేశారు. శనివారం ఉరవకొండలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సవరణ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. ఎందుకంటే ఇది మత స్వేచ్ఛకు విరుద్ధమన్నారు. మైనార్టీలకు తమ ఆస్తులను నిర్వహించుకునేందుకు రాజ్యాంగంలోని 30వ అధికరణ వీలు కల్పిస్తుందన్నారు. ఈనేపథ్యంలో ఎన్‌డిఎ కూటమిలోని భాగస్వామ్య పార్టీలు వక్ఫ్ భూములను కాపాడే పద్ధతుల్లో ఉండాలని కోరారు. ఇకపోతే ఉరవకొండ నియోజకవర్గంలో గుంతకలు బ్రాంచి కెనాల్, హంద్రీనీవా కాలువలకు అధికారికంగా నీటి కేటాయింపులు చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు కేశవరెడ్డి, మల్లికార్జున, పార్వతీప్రసాద్, ఎంబి.చెన్నారాయుడు, మల్లేష్, మునాఫ్, వజ్రకరూరు సుల్తాన్, ముట్టాల శ్రీరాములు, మంచినీళ్ల ప్రసాద్, వన్నూరుస్వామి, మలరాయుడు, అరుణ్, షరీఫ్, రాజారెడ్డి, సిద్దేశ్వర, తిమ్మరాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

'జెసి'ని కలిసిన 'పల్లె'


జెసి దివాకర్‌రెడ్డితో మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి

అనంతపురం కలెక్టరేట్ : మాజీఎంపీ దివాకర్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని నివాసంలో మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా రాజకీయాలతోపాటు పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

నోటు పుస్తకాలు పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న దాతలు

నార్పల : అనంతపురానికి చెందిన అల్లాడి నారాయణ స్వామి, కాంతమ్మ దంపతులు శనివారం మండల కేంద్రంలోని సత్యసాయి యోగా విద్యాలయలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. వీటితోపాటు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరాధరణకు గురైన వారికి నిర్వాహకులకు ఆశ్రయం కల్పించడం గొప్ప విషయమన్నారు. వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరంశెట్టి చతుర్య, చిరదీపు, గోపాల్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు పదవి కోసం వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

మండల టిడిపి సీనియర్ నాయకులు, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు ఎన్.సూర్యచంద్రుడు (కరిడికొండ సూరి)కి గుత్తి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పదవి ఇవ్వాలని గుత్తి మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, టిడిపి నాయకులు కోరారు. ఈమేరకు శనివారం ఎమ్మెల్యే నివాసానికి నాయకులు వెళ్లి కరిడికొండ సూరి బయోడేటాను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి పి.భరత్‌కుమార్, ఎంపిటిసి ఎం.ధనుంజయ, తెలుగు యువత మండల అధ్యక్షుడు కరిడికొండ సుధాకర్‌నాయుడు మాట్లాడుతూ 30 ఏళ్లుగా కరిడికొండ సూరి టిడిపిలో క్రియాశీలకంగా పని చేశారన్నారు. టిడిపి కార్యకర్తలకు చేదోడు వాదాడుగా ఉంటూ నిస్వార్థంగా పనిచేశారన్నారు. అలాంటి నాయకుడికి మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవి ఇవ్వాలని కోరారు. అనంతరం టిడిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు జి.వెంకటశివుడు యాదవ్‌ను కలిసి బయోడేటను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కృష్ణారావు, నరేంద్రచౌదరి, ఎన్.ప్రభాకర్‌నాయుడు, జయన్న, సత్య, మండల నాగరాజు, రామరాజు, చంద్రప్రతాప్ నాయుడు, శివ, న్యాయవాది మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అడుగూ 'అనంత' అభివృద్ధి వైపు

పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి


ఎమ్మెల్యేకు బుద్ధుని విగ్రహాన్ని బహూకరిస్తున్న తెలుగు యువత నాయకులు ఓంకార్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజలు, కార్యకర్తలు చూపుతున్న అభిమానాన్ని ఎప్పటికీ మర్చిపోలేనని.. ప్రతి అడుగు అనంతపురం అభివృద్ధి వైపే వేస్తానని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అర్బన్ కార్యాలయంలో భారీగా కేక్‌లు కోసం సంబరాలు చేసుకున్నారు. వేలాదిగా కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలిరావడంతో ఉదయం నుంచి రాత్రి వరకూ సందడి వాతావరణం నెలకొంది. ఇందులో భాగంగా పలుచోట్ల రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. అలాగే అన్నదాన కార్యక్రమాలు, ప్రభుత్వాసుపత్రి, అనాథ శరణాలయాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తనపై ఇంతటి అభిమానం చూపుతున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. భగవంతుని ఆశీస్సులు, ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో తన శక్తి ఉన్నంత వరకూ ప్రజలకు సేవ చేస్తానన్నారు.

అనంతపురం కార్పొరేషన్ : జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర్ ప్రసాద్‌కు తెలుగు యువత నాయకులు ఓంకార్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా గౌతమ బుద్ధుని విగ్రహాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధికార ప్రతినిధి లక్ష్మీనరసింహా, మాజీ ఎంపిపి, ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ సభ్యులు ఇస్మాయిల్, బిసి సంఘం జోగి రాజేంద్ర, ఆది, ఇబ్రహీం, వలి, శ్రావణ్, మనోహర్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : నగరంలోని 10వ డివిజన్‌లో టిడిపి నాయకులు పోతుల లక్ష్మీనరసింహులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పారిశుధ్య కార్మికులతో కలిసి భారీ కేక్ కోసి పంచిపెట్టారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి చేరుకుని ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. తర్వాత రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దుదేకుల బాబు, గోపాల్, కడియాల కొండన్న, కుమ్మర మధు, పోతుల మంజు, నాగరాజు, ఎస్.సూరి, దుర్గా, విశ్వనాథ్, ప్రపుల్లా, మహేష్, షబ్బీర్, శివ, అంజి, మంజుల నారాయణ, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.

అలాగే తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని వాల్మీకి ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా పుష్పగుచ్ఛం అందజేసి కేక్ కోసి పంచిపెట్టారు.

కాగా అనంతపురం డిపోలో నూతన బస్సులను ప్రారంభించడానికి ఇచ్చిన ఎమ్మెల్యేకు నేషనల్ మాజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో కమిటీ సభ్యులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.

స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సాయిట్రస్టు ఆధ్వర్యంలో టిడిపి సీనియర్ నాయకులు నెట్టెం బాలకృష్ణ ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓంకార్ రెడ్డి, మని, రవి వాల్మీకి, శంకర్, నెట్టెం రామానాయుడు, రామకృష్ణ, కోనంకి శ్రీనివాస్, ఆది, వలి, ఇబ్రహీం, సాయిట్రస్టు సభ్యులు నారాయణ, రాఘవేంద్ర, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాసం ప్రత్యేక పూజలు

బొమ్మనహాల్ : శ్రావణమాసం మొదటి శనివారాన్ని పురస్కరించుకుని మండలంలోని దేవరకొండ, నేమకల్లు గ్రామాల్లో వెలసిన ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారికి తమలపాకల పూజ, కుంకుమార్చన, పుష్పాభిషేకాలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు అనిల్ స్వామి తెలిపారు. భక్తులు భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఉచిత భోజనం, కౌంటర్, బస్సులు, ద్విచక్ర వాహనాలు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వహణ అధికారి నర్సింహారెడ్డి తెలిపారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

గుత్తి : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు పి.నారాయణస్వామి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయిస్వామి పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ 89వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వెంకట్‌నాయక్, చిన్న, అఖిల్, సునీల్, విజయ్, నరసింహా, తదితరులు పాల్గొన్నారు.

బెంబేలెత్తించిన దొంగలు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎంతో పకడ్బందీగా ఉండే ఎటిఎంల దొంగతనాలు బెంబేలెత్తిస్తున్నాయి. వరుసగా రెండు రోజుల్లో రెండు చోట్ల ఎటిఎం కేంద్రాలనే దోచేసిన ఘటనలు చోటు చేసుకున్నాయి. అది కూడా ఒకటి గార్లదిన్నె మండల కేంద్రంలో చోటు చేసుకోగా, మరొకటి జిల్లా కేంద్రమైన అనంతపురం నగరంలో చోటు చేసుకుంది. అది కూడా జనరద్దీ ఉండే రామ్‌నగర్ ప్రాంతంలో చోటు చేసుకుంది. ఇతర రాష్ట్రాలకు చెందిన వారే ఈ పని చేసినట్టు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. అయితే నగరం నడిబొడ్డున దొంగలు రాత్రి సమయంలో వచ్చి గ్యాస్ కట్టర్లతో కట్ చేసి ఎటిఎం దొంగలించి రూ.30 లక్షల నగుదు దోచుకోవడం సంచలనం కలిగిస్తోంది. ఎందుకంటే దొంగతనాలను అరికట్టేందుకని రాత్రి సమయాల్లో పోలీసు గస్తీ ఉందా లేదా అన్న చర్చ నడుస్తోంది. ఎన్నికల సమయం నుంచి వరుసగా ఉన్నతాధికారులు బదిలీలవుతూ వస్తున్నారు. ఇటీవలనే మురళీకృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఆయన తిరిగి గస్తీని ప్రారంభించే విధంగా అధికారులను ఆదేశించియున్నారు. అయితే చోరీయే కాకుండా సత్యసాయి జిల్లాలోనూ హిందూపురంలో విశ్రాంత డీఎస్పీ నివాసంలోనూ చోరీ జరిగింది. ఇంకా ఇతర ప్రాంతాల్లోనూ ఈ వారంలో చోరీలు చోటు చేసుకున్నాయి. వరుస చోరీలు అందరిలోనూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పోలీసులు వీటిపై దృష్టి సారించి అరికట్టే చర్యలు చేపట్టాలని సామాన్యులు కోరుతున్నారు. ఇక ఈవారంలో చోటు చేసకున్న ఇతర ప్రధాన అంశాల్లో రాజకీయపరమైనవి ఉన్నాయి. వైసిపికి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య రాజీనామా చేసి బిజెపిలో చేరారు. కొత్తగా ఆ పార్టీకి అధ్యక్షులుగా ఎవరిని నియమిస్తారన్నది చూడాల్సి ఉంది. జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఫలితాలొచ్చినప్పటి నుంచి ముఖ్యనేతలెవరూ పెద్దగా కనిపించడం లేదు. గతంలో అధికారంలోనున్న సమయంలో నిత్యం మీడియా సమావేశాల్లో పెడుతూ హల్‌చల్ చేసే నేతల అలికిడి కూడా ఎక్కడా కనిపించడం లేదు. ఇక టిడిపిలోనూ, కూటమిలో లుకలుకలు బయటకు వస్తూనే ఉన్నాయి. ధర్మవరంలో టిడిపి, బిజెపి నేతలు బహిరంగంగా ఘర్షణ పడ్డారు. ఇకపోతే కూటమి ప్రభుత్వం వచ్చాక స్కీమ్ వర్కర్ల తొలగింపుపై సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. ప్రభుత్వమెచ్చిన మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్‌వాడీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు , ఆశావర్కర్లు ఇలా స్కీమ్‌వర్కర్లు అందరినీ తొలగిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో తొలగింపులు సరైనవి కావని పుట్టపర్తి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అదేవిధంగా అనంతపురం జిల్లాలో కళ్యాణదుర్గం ఆర్డీవో కార్యక్రమం వద్ద నిరసన చేపట్టారు. జులై నెలలో తీవ్ర వర్షాభావంతో పంటల సాగు ప్రభావం పడింది. ఆగస్టు నెలలో ఈ వారంలో ఓ మోస్తరు వర్షపాతం పడింది. అయితే వర్షం జిల్లా అంతటా ఒకే రకంగా పడలేదు. అక్కడక్కడ వర్షాలు పడటంతో రైతులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. ప్రధాన పంట అయిన వేరుశనగ సాగుకు ఇప్పటి సమయం ముగిసింది. ఇక ప్రత్యామ్నాయ పంటలైనా సాగు చేసుకునేందుకు సమయం ఉంది. జిల్లా వ్యవసాయాధికారులు ఇప్పటికే ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రణాళికలు రూపొందించారు.

మానసిక సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న గేట్స్ కళాశాల ఎండి

ప్రజాశక్తి-గుత్తి

విద్యార్థులు శారీరిక, మానసిక సామర్థ్యాలను పెంపొందించుకోవాలని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వికె.పద్మావతమ్మ, ఎండి జి.రఘునాథరెడ్డి, డైరెక్టర్ శ్రీవాణి సూచించారు. శనివారం స్థానిక గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజినీరింగ్ చదివే విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా చదువుతోపాటు ఇంటర్వ్యూ స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. నూతన ఆవిష్కరణలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఎఒ ఇంతియాజ్ బాషా, హెచ్‌ఒడి హరిప్రియ, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల

రాయదుర్గం : వచ్చేనెల 3, 4, 5వ తేదీల్లో విజయవాడలో జరగనున్న అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర మహాసభల కరపత్రాలను శనివారం పట్టణంలోని సమైక్యాంధ్ర భవన్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య తాలూకా అధ్యక్షుడు కుమార్‌నాయక్, దినకర్, మాధవ్, చరణ్, బాలాజీ, హనుమంతు, లోహిత్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ శిలాఫలకం ధ్వంసం అమానుషం


మోకాళ్లపై నిరసన తెలుపుతున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

గుత్తి : విజయవాడలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్మృతి వనంపై దాడి చేసిన దుండగులపై కఠిన చర్యలు చేపట్టాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు అంజన ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయ శిల్పమైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహంపై దుండగులు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. నిందితులను గుర్తించి శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు జి.రామదాసు, రాము, హరి, కాశీరావు, లాలెప్ప, ఓబులేసు, హమాలీ రామాంజి, చంద్ర, రామాంజి, వెంకటేష్, రాజేష్, వేణు, కన్నప్ప, నాగార్జున, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.